









భీమవరం పద్మావతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి లక్ష దీపోత్సవం కన్నుల పండువగా జరిగింది. - 8లో..

మావుళ్లమ్మకు పడిపూజ నిర్వహిస్తున్న మాలధారులు -7లో..





పేరుపాలెం బీచ్‌లో సందడి

సండే సందడి

మొగల్తూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మొగల్తూరు, నరసాపురం మండలాల్లోని బీచ్‌లు ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. కార్తీకమాసం.. అందునా ఆదివారం కావడంతో వన సమారాధనలకు కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లకు ఏటా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సందర్శకులు భారీగా తరలివస్తారు. ఈ ఏడాది మొంథా తుఫాన్, భారీ వర్షాల కారణంగా కార్తీకమాసం ప్రారంభమైనా నేటి వరకూ బీచ్ వద్దకు సందర్శకులను అనుమతించలేదు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో తొలిసారిగా ఈ ఆదివారం పర్యాటకులను అనుమతించడంతో సందర్శకుల తో బీచ్ కళకళలాడింది. ఉవ్వెత్తున ఎగసి పడుతున్న అలలతో సమానంగా పర్యాటకులు ఎగసిపడి సముద్ర స్నానం చేసి సేదతీరారు. అనంతరం తీరం వెంబడి ఉన్న ఆలయాలను సందర్శించారు. డీఎస్పీ డాక్టర్ శ్రీవేద ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, ఆరుగురు ఎస్‌ఐలు, 100 మంది పోలీస్ సిబ్బంది, మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సముద్ర స్నానం చేసేందుకు సందర్శకులు లోపలకంటూ వెళ్లకుండా 20 మంది గజ ఈతగాళ్లను నియమించారు. ఆర్డీవో దాసి రాజు, తహసీల్దార్ కె.రాజ్‌కిశోర్ రెవెన్యూ సిబ్బంది బీచ్‌ను సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కార్తీక వనసమారాధనల జోష్.. ఆటపాటలతో హుషారు -8లో..

వేములదీవి వెస్ట్ కార్యదర్శి సస్పెన్షన్

నరసాపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వేములదీవి వెస్ట్‌లో రీ సర్వేకు సంబంధించి ఒకే ఫోన్ నెంబరుతో మ్యాపింగ్ చేయడంతోపాటు విధుల్లో అలసత్వం వహించిన గ్రామ కార్యదర్శి ఏసుప్రకాశ్‌ను సస్పెండ్ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఆస్తి పన్నులకు సంబంధించి 1116 అసైన్‌మెంట్లు ఉండగా.. వాటిలో 967 అస్సులకు వేర్వేరు ఫోన్ నెంబర్లు నమోదు చేయకుండా అన్నింటికి ఒకే ఫోన్ నెంబర్ ఉపయోగించారు. ఈ కారణంగా ఆయనను సస్పెండ్ చేసినట్లు ఈవోపీఆర్డీ నాగేంద్ర కుమార్ తెలిపారు.



జిల్లాను నిధుల కొరత వేధిస్తోంది. పలు అభివృద్ధి పనులు నిలిచి పోయే పరిస్థితి ఏర్పడింది. ఆర్థిక సంఘం నిధులు లేక గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరాతోపాటు వివిధ పనులు ముందుకు సాగడం లేదు. జలజీవన్ మిషన్ కింద కాంట్రాక్టర్లు చేపట్టిన పనులకు సుమారు 50 కోట్ల వరకు బకాయిలు వున్నాయి. వీటిని విడుదల చేస్తే తప్ప తాము పనులు చేపట్టలేమని వారు స్పష్టం చేశారు. అలాగే మత్స్యకారుల బోట్లకు ఇవ్వాల్సిన డీజిల్ సబ్సిడీ రెండు నెలలుగా అందడం లేదు. వీటిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

నిధులు కావలెను

ఆర్థిక సంఘం నిధులు ఎప్పుడిస్తారు?

- జిల్లాలో గ్రామ పంచాయతీలకు రావాల్సింది రూ.855 కోట్లు
- ఉత్తర్వుల జారీతో ఆశలు.. భారమవుతున్న నిర్వహణ

(తాడేపల్లిగూడెం రూరల్-ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంఘం నిధుల కోసం గ్రామాలు నిరీక్షిస్తున్నాయి. ఓ వైపు పారిశుధ్య పనులు, మరోవైపు సిబ్బంది జీతాలు, వీటికితోడు విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేందుకు అవసరమైన నిధులు లేక విలవిల్లాడుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నుంచి జనాభా ధామాషా ప్రకారం మూడో విడత ఒక్కొక్కరికి రూ.473 చొప్పున నిధులు విడుదల చేశారు. నాలుగో విడత గ్రామ పంచాయతీలకు రూ.855 కోట్లు విడుదలకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసి రోజులు గడుస్తున్నా, నిధులు మాత్రం విడుదల కాలేదు. వీటి కోసమే గ్రామాలు ఎదురుచూస్తున్నాయి. మంచినీటి సరఫరా, పారిశుధ్య సమస్యలతో మైనర్ పంచాయతీలు సతమతం అవుతున్నాయి.



తుఫాన్ భారం..

మొంథా తుఫాన్ ప్రభావం గ్రామాలపై పడింది. పారిశుధ్య నిర్వహణ, మంచి నీటి సరఫరాకు జనరేటర్లను అద్దెకు తెచ్చి వినియోగించేందుకు పంచాయతీ పాలక వర్గాలు, అధికారులు అప్పులు చేసి మరీ అత్యవసర ఏర్పాట్లు చేశారు. ఆ ఖర్చుకు డిజాస్టర్ నిధులు వస్తాయని చెబుతున్నా అవి ఇంకా రాలేదు. కనీసం ఆర్థిక సంఘం నిధులైనా విడుదల చేస్తే సర్దుకోవచ్చని గ్రామ పాలక వర్గాలు భావిస్తున్నాయి. మరో మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని భావిస్తున్న తరుణంలో ఈ కొద్దిపాటి సమయంలో గ్రామాల్లో

(మిగతా 8వ పేజీలో)

స్తంభించిన జలజీవన్.. రూ.50 కోట్ల బిల్లులు పెండింగ్

నిధులు సకాలంలో విడుదల కాక జిల్లాలో జల జీవన్ మిషన్ పనులు నిలిచిపోయాయి. ప్రతి ఇంటికి కుళాయి నీరు ఇవ్వాలన్న లక్ష్యంతో రూ.335 కోట్లతో పనులు చేపట్టారు. ఇప్పటి వరకు సగం పనులు పూర్తయ్యాయి. చేసిన వాటికి బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో మిగిలిన పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు వెనకడుగు వేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పల్లెల్లో ప్రతి ఇంటికి మంచినీరు అందించాలన్న ఉద్దేశంతో జల జీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభించారు. నీటి సరఫరాకు ప్రతి నివాసానికి కుళాయి, అంతర్గత పైప్‌లైన్లు, ఓహెచ్ఆర్ ట్యాంకు పనులు చేపట్టడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. జిల్లాలో దీనికి రూ.335 కోట్లు కేటాయించారు. ఇప్పటి వరకు 50 శాతం అంటే.. రూ.167 కోట్ల విలువైన పనులు పూర్తిచేశారు. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అధికారులు నెలవారీ లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. కాని, ఏడాది నుంచి బిల్లులు బిల్లులు పెండింగ్‌లో ఉండిపోవడంతో పనులు కొనసాగించేందుకు కాంట్రాక్టర్లు విముఖత ప్రదర్శిస్తున్నారు. పనులు మొదలైనప్పటి నుంచి విడతల వారీగా రూ.117 కోట్లు విడుదల చేశారు. ఇంకా రూ.50 కోట్లు బిల్లులు రావాల్సి వుంది. వీటిని జిల్లా గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు సీఎఫ్‌ఎంఎస్‌లో నమోదు చేశారు. బిల్లులకు డోకా లేదు.. పనులు చేయాలని అధికారులు కాంట్రాక్టర్లను కోరుతున్నారు.

పల్లెల్లో మంచినీటి సరఫరాకు నిర్దేశించిన ప్రాజెక్టు

- జిల్లాకు రూ.335 కోట్లు కేటాయింపు
- రూ.167 కోట్ల విలువైన పనులు పూర్తి
- బిల్లులు రాక నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- త్వరలోనే వస్తాయంటున్న అధికారులు



కేంద్రం 60 - రాష్ట్రం 40 శాతం నిధులు

జలజీవన్ మిషన్ ప్రాజెక్ట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్నాయి. ప్రాజెక్ట్ వ్యయంలో 60 శాతం కేంద్రం, 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు పనులు గతంలోనే ప్రారంభమైనప్పటికి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే బిల్లులు సక్రమంగా చెల్లిస్తారన్న నమ్మకంతో పనులు జోరందుకున్నాయి. పల్లెల్లో అవసరమైన పైప్‌లైన్లు వేసి కుళాయి సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రతి సారీ కేంద్రం నుంచి నిధులు త్వరితగతిన మంజూరయ్యేవి. ఈసారి జాప్యం జరిగిందని చెబుతున్నారు. కొన్ని రోజుల్లో ఈ సమస్య పరిష్కారం అవుతుందని గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు స్పష్టం చేశారు.

వాటర్ గ్రిడ్‌తో మరింత ప్రయోజనం

ప్రస్తుతం పల్లెల్లో మంచినీటి చెరువులకు కలుషిత నీరు చేరుతోంది. దీనివల్ల గ్రామీణ ప్రాంత ప్రజలు శుద్ధి ప్లాంట్‌ల నుంచి నీటిని కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే జల జీవన్ మిషన్‌తో మరింత ప్రయోజనం ఉంటుంది. విజ్జేశ్వరం నుంచి పైప్‌లైన్ ప్రాజెక్ట్ ద్వారా శుద్ధిచేసిన మంచినీటిని పంచాయతీల్లోని సంప్‌లు, ఓవర్ హెడ్ ట్యాంకులకు మళ్లిస్తారు. గ్రామాల్లో అంతర్గత పైప్‌లైన్‌లు పటిష్టంగా ఉంటాయి. వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టులో విజ్జేశ్వరం వద్ద ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి భూమి కోసం అన్వేషిస్తున్నారు. జలజీవన్ పూర్తయితే జిల్లా ప్రజలకు స్వచ్ఛమైన గోదావరి జలాలు ఇంటికి చేరనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం నెరవేరనుంది.



బోట్ల డీజిల్ సబ్సిడీకి బ్రేక్..!

- లీటరుకు రూ.9 సబ్సిడీ
- రెండు నెలలుగా అందక మత్స్యకారుల ఆవేదన

(నరసాపురం-ఆంధ్రజ్యోతి)

సముద్రంలో వేట సాగించే మత్స్యకారుల బోట్లకు డీజిల్‌పై ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ మొత్తం రెండు నెలలుగా బ్రేక్ పడింది. బోట్ల యజమానులు మత్స్యశాఖ అధికారులను కలిసి ఎందుకు ఆగిందన్న దానిపై ఆరా తీస్తున్నారు. సముద్ర వేట సాగించే మత్స్యకారులకు చేయూతనివ్వాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం బోట్ల డీజిల్‌పై లీటరుకు తొమ్మిది రూపాయలు చొప్పున సబ్సిడీ ఇస్తోంది. పెద్ద బోట్లకు (సోనా) నెలకు మూడు వేల లీటర్లు, చిన్న ఫైబర్ బోట్లకు 300 లీటర్ల చొప్పున రాయితీ కల్పిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రాయితీ అందని ద్రాక్షగా మిగిలింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రాయితీని పునరుద్దరించింది. లైసెన్స్ బోటు కలిగిన ప్రతి మత్స్యకారునికి ముందుగా కార్డు జారీచేసింది. నిర్దేశించిన పెట్రోల్ బంకుల్లో ఈ రాయితీ పొందే సదుపాయాన్ని కల్పించింది. వేటకు వెళ్లే సమయాల్లో మత్స్యకారులు అవసరమైన ఆయిల్‌ను కొట్టించుకుని, అందులో నుంచి రాయితీ మొత్తాన్ని మినహాయించి మిగిలిన సొమ్మును బంకు యజమానికి చెల్లిస్తారు. ముందుగానే సబ్సిడీ మొత్తాన్ని బంకు యజమానుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుంది. కొన్ని బోట్లకు రెండు నెలలుగా ఈ సబ్సిడీ అందడం లేదు. ప్రభుత్వం సొమ్ములు జమ చేయకపోవడంతో సబ్సిడీపై డీజిల్ కొట్టేది లేదని బంకుల యజమానులు చెబుతున్నట్టు మత్స్యకారులు చెబుతున్నారు. గత నెలలో తుఫాన్ కారణంగా 15 రోజుల పాటు మత్స్యకారులు సముద్ర వేటకు వెళ్ల లేదు. ఈ నెలా ఆరంభం నుంచి మళ్లీ వేట మొదలు పెట్టారు. ఈ సమయంలో సబ్సిడీ అందకపోవడంతో చాలా మంది మత్స్యకారులు మొత్తం సొమ్ము చెల్లించాల్సి వచ్చింది. దీనిపై కొందరు మత్స్యశాఖ అధికారులను కలిసి ఆరా తీశారు. నరసాపురం తీరంలో సోనా బోట్లు (మిగతా 8వ పేజీలో)



గత నెలలో అందలేదు



గత ప్రభుత్వ హయాంలో సబ్సిడీ అందేది కాదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దీనిని పునరుద్దరించారు. అక్టోబరు నుంచి సబ్సిడీ సరిగా అందడం లేదు. పెద్ద బోట్లకు నరసాపురంలో సబ్సిడీ ఇవ్వడం లేదు. కాకినాడ, మచిలీపట్నం బంకులకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుంది. స్థానికంగా కల్పించాలి.

- రాంబాబు, బోటు నిర్వాహకుడు

విచారణ చేస్తున్నాం

ఈ సమస్యను కొందరు బోటు నిర్వాహకులు నా దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై విచారణ చేస్తున్నాం. సాధారణంగా సబ్సిడీ నిలుపుదలకు అనేక కారణాలు ఉంటాయి. బంకులకు ప్రభుత్వం సబ్సిడీ మొత్తాన్ని జమ చేయకపోయినా, బోటు నిర్వాహకుల లైసెన్స్ రెన్యువల్ కాకపోయినా, సబ్సిడీ కార్డులు సరిగా స్కానింగ్ జరక్కపోయినా ఈ సమస్యలు వస్తాయి. దీనిపై విచారించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

- ఏడుకొండలు, మత్స్యశాఖ అధికారి

ఆర్టీసీలో పదోన్నతులకు రైట్ రైట్



- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 326 మందికి ఛాన్స్
- నేడు విజయవాడలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లకు కౌన్సెలింగ్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఆరేళ్ల నుంచి పదోన్నతుల కోసం ఎదురు చూసిన ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాతిపదికన 326 మంది ఉద్యోగుల పదోన్నతులకు పశ్చిమ డీపీటీవో వరప్రసాద్ కసరత్తు పూర్తిచేశారు. నరసాపురం, జంగారెడ్డిగూడెం, ఏలూరు, నూజివీడు, తాడేపల్లిగూడెం, తణుకు డిపోల పరిధిల్లో ఉద్యోగులకు మేలు జరగనుంది. ఈ పదోన్నతులతో ఖాళీలను భర్తీ చేస్తారు. ఇటీవలే కూటమి ప్రభుత్వం ఆర్టీసీలో కిందస్థాయి ఉద్యోగులకు పదోన్నతిని కల్పించేందుకు జీవో నెంబర్ 40ను విడుదల చేసింది.

వైసీపీ సర్కార్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినా ఉద్యోగుల బాగోగులను పట్టించుకోలేదు. సర్వీసు రూల్స్ నుంచి పదోన్నతుల వరకు ఉద్యోగులకు కప్పదాట్లతోనే కాలం గడిపేసింది. ప్రజా రవాణా ఉద్యోగుల బాధలను, ఆవేదనలను అర్థం చేసుకున్న కూటమి ప్రభుత్వం పలు కేడర్లలో ఉద్యోగుల పదోన్నతులకు మార్గం సుగమం చేసింది. కొన్ని జిల్లాలో పదోన్నతులపై కోర్టులను ఆశ్రయించడంతో ఉమ్మడి జిల్లాలో ఏ విధంగా చేపట్టాలన్న దానిపై సోమవారం నాటికి తుది రూపు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఉద్యోగుల రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్ల (మిగతా 8వ పేజీలో)

మొంథా నష్టాలపై నేడు కేంద్ర బృందం ఉంగుటూరులో పర్యటన

ఏలూరుసిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్‌తో నష్టపోయిన పంట పొలాలను పరిశీలించేందుకు కేంద్ర బృందం సోమవారం ఏలూరు జిల్లాలో పర్యటించనుంది. బృందంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు డాక్టర్ కె.పొన్నుస్వామి, శ్రీనివాసు భైరి, ఆర్తిసింగ్, మనోజ్‌కుమార్ మీనా ఉన్నారు. వీరు సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఉంగుటూరు మండలంలో తుఫాన్ నష్టాలు, జిల్లా యంత్రాంగం చేపట్టిన పునరుద్ధరణ చర్యలపై ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారు. అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి తుఫాన్ నష్టాలను పరిశీలించి 4.30 గంటలకు తూర్పు గోదావరి జిల్లా గోపాలపురానికి వెళతారని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.

రెండు ప్రాజెక్టులకు రేపు సీఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన

ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలోని సీహెచ్ పోతేపల్లిలో రూ.208 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్, నూజివీడు మండలంలో రూ.110 కోట్లతో ఏర్పాటు కానున్నా రమణసింగ్ గ్లోబల్ ఫుడ్ పార్కులకు ఈ నెల 11న సీఎం చంద్రబాబునాయుడు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో 20 ఎకరాల్లో ఏర్పాటుచేసిన ఎంఎస్‌ఎంఈ పార్కును ప్రారంభిస్తారన్నారు.

వరి కోతలకు వెళ్లి విద్యుత్ షాక్

ఇద్దరు దుర్మరణం



ఘటనా స్థలం..



సందీప్, సింహాద్రి (ఫైల్)

ఇరగవరం/గండేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):వరి కోతలకు వెళుతుండగా విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. ఇరగవరం మండలం పేకేరుకు చెందిన కరిపెట్టి సింహాద్రి అప్పన్న(53) వరి కోత యంత్రాలతో ఆయా ప్రాంతాలకు వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. అతని వద్ద కోత మిషన్ డ్రైవర్‌గా రాపాకకు చెందిన గెడ్డం సందీప్(20) పని చేస్తున్నాడు. కాకినాడ జిల్లా పరిసర ప్రాంతాల్లో వరి కోతలు కోసేందుకు ఐషర్ వ్యాన్‌పై కోత యంత్రం వేసుకుని బయలుదేరారు. ఆదివారం గండేపల్లి మండలం రామయ్యమ్మపాలెం వద్ద మిషన్‌కు 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి డ్రైవర్ సందీప్ షాక్‌తో మృతి చెందాడు. ముందు బండిపై వెళుతున్న అప్పన్న వెనక్కి వచ్చి ఏమయిందోనని వ్యాన్‌ను ముట్టుకోగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మృతదేహాలను అంబులెన్స్‌లో మార్చురీకి తరలించారు. సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ శివనాగబాబు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు.

శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

సందీప్ తండ్రి లాజరు వ్యవసాయం చేస్తుంటాడు. తల్లి ప్రేమలత ఉపాధి నిమిత్తం ఇతర దేశాలకు వెళ్లారు. సందీప్ పెద్ద అక్కకు వివాహం కాగా, రెండో అక్క డిగ్రీ చదువుతోంది. సందీప్ పదో తరగతి వరకు చదువుకుని డ్రైవర్‌గా చేరారు. సోదరుడి మృతితో అక్కలు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. అప్పన్నకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు వీరాస్వామి, వెంకటరమణ ఉన్నారు. పెద్ద కుమారుడు ఇటీవల అమెరికాకు వెళ్లేందుకు సిద్ధపడుతుండగా చిన్న కుమారుడు వెంకటరమణ బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం ఉదయం వీరి మరణవార్త వినగానే రాపాక, పేకేరు గ్రామాల్లో బంధువులు, కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు.



విషాదంలో కుటుంబ సభ్యులు



శ్రీవారి ఆలయం ప్రాంగణంలో భక్తుల రద్దీ

కిటకిటలాడిన గోవిందుని సన్నిధి

ద్వారకాతిరుమల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం అందులోనూ అందరికీ సెలవురోజు కావడంతో ఉదయం నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. 15 వేలమందికి పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి 2గంటల పైబడి సమయం పట్టింది. సాయంత్రం నుంచి రద్దీ కాస్తతగ్గుముఖం పట్టింది. ఆలయంలోని వృక్షాల వద్ద పలువురు యాత్రికులు కార్తీక దీపాలు వెలిగించారు. శ్రీవారి నిత్యార్జిత కల్యాణంలో దాదాపు 123 జంటలు పాల్గొన్నారు.

వైభవంగా సువర్చల హనుమద్ కల్యాణం



జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 9:గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీకమాసం పురస్కరించుకుని స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆదివారం ఉదయం హనుమద్ హోమం నిర్వహించిన అనంతరం సువర్చల హను మద్ కళ్యాణం ఆలయ అర్చకులు, వేద పండితులు, ఋత్వికుల ఆధ్వ ర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ సేవల రూపంలో రూ.2,68,740 ఆదాయం లభించినట్టు 4200 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించినట్టు ఈవో చందన తెలిపారు.

నేత్రపర్వంగా శివకల్యాణం



ద్వారకాతిరుమల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర పాలకునిగా విరాజిల్లుతోన్న శివదేవుని ఆలయంలో స్వామివారి కల్యాణం ఆదివారం నేత్ర పర్వంగా జరిగింది. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయ ముఖమండపంలో ఏర్పాటు చేసిన వేదికపై గంగా,పార్వతీ సమేత శివయ్య కల్యాణ మూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. శుభముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీల కర్ర బెల్లం ధరింపచేసి మాంగల్య ధారణ, తలంబ్రాలు మేళతాళాలు, డోలు ,సన్నాయి వాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు.

గుబ్బల మంగమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



బుట్టాయగూడెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీలో వేంచేసిన వనదేవత గుబ్బల మంగ మ్మతల్లిని దర్శించుకోడానికి భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి దర్శనాలకు వచ్చిన భక్తులతో అమ్మ వారి ఆలయ ప్రాంగణం కిటకిలాడింది. దర్శనాలు అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

క్షీరారామునికి ప్రత్యేక పూజలు



పాలకొల్లు టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రమైన శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామివారి ఆలయానికి ఆదివారం పంచారామ యాత్రల పేరుతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సుమారు 18 వేల మంది స్వామివారిని దర్శించుకున్నట్టు ఆలయ వర్గాల సమాచారం.



దెబ్బతిన్న ప్రహరీ గోడ : స్వామివారి ఆలయం పడమర వైపు ఉన్న ఆలయ బేడా మండపం గోడ వెనుక వైపు 20 అడుగుల మేర ప్రహరీ దెబ్బతింది. ఈ గోడ అడుసు, మట్టి ఇటుకలతో నిర్మించారని, ఇటీవల కురిసిన వర్షాలకు గోడ దెబ్బతిని ఉంటుందని చైర్మన్ మీసాల రాము తెలిపారు. ముందు జాగ్రత్తగా బేడ మండపం వైపు భక్తులు ప్రదక్షణలు చేయకుండా నిలిపి వేసినట్టు వివరించారు.

జంగారెడ్డిగూడెంలో గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ



జంగారెడ్డిగూడెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తన తండ్రి ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం ప్రపంచ వ్యాప్తంగా అభిమానుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న గాయ కుడని ఆయన తనయుడు ఎస్పీ చరణ్ అన్నారు. ఆదివారం జంగారెడ్డిగూడెం జడ్పీ బాలుర హైస్కూల్ సమీపంలో ఎస్పీ బాలు అభిమాని కుందా శాస్త్రి మాస్టారు ఆర్థిక సహకారంతో నిర్మించిన బాలసుబ్ర హ్మణ్యం విగ్రహాన్ని ఎస్పీ చరణ్ ఆవిష్కరించారు.సినీ నిర్మాత కరాటం రాంబాబు మాట్లాడుతూ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 27 సంవత్సరాల క్రితం దేవుళ్లు సినిమాలో ఎస్పీ బాలు మూడు పాటలు పాడారని ఆ పాటలు ఇప్పటికీ ఎవర్‌గ్రీన్‌గా ఉన్నాయన్నారు. నిర్వాహకులు, పలువురు నాయకులు ఎస్పీ చరణ్‌ను ఘనంగా సత్కరించారు. నిర్వాహకుడు కుందా శాస్త్రి, శిల్పి ఉడయార్‌లను సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, పాల్గొన్నారు.

ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ పురస్కారాలకు ఉమ్మడి జిల్లాలో ఆరుగురి ఎంపిక

ఏలూరు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భారతరత్న మౌలానా అబుల్‌కలాం అజాద్ 138వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అంద జేసే ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డులకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆరుగురుని ఎంపిక చేశారు. ఎంపికైన ఉత్తమ టీచర్ల జాబితాను మైనార్టీస్ సంక్షేమశాఖ విడుదల చేసింది. ఏలూరు జిల్లానుంచి ఏలూరులోని మౌలానా అబుల్‌కలాం అజాద్ (మాకా)ఉర్దూ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న షేక్ షకీలా బేగం ఎంపికయ్యారు. జంగారెడ్డిగూడెంలో ఎస్జీటీగా 2023-24 విద్యా సంవత్సరంలో పనిచేస్తున్న సమయంలో ఏడేళ్లుగా మూతపడిన ఓ ఉర్దూ స్కూలును పునః ప్రారంభింపజేయించడంతో పాటు, అదే పాఠశాలకు డిప్యూటేషన్ వేయించుకుని ఏకంగా 40 మంది బాల,బాలికలను స్కూలులో చేర్పించడంలో విజయం సాధించడంతో ప్రశంసలందుకున్నారు. ఈమెతో పాటు జిల్లానుంచి అవార్డులు పొందిన వారిలో ఉంగుటూరు మండలం చేబ్రోలు ఉర్దూ ప్రాథ మికోన్నత పాఠశాలలో ఎస్జీటీలుగా పనిచేస్తున్న తస్లీం సుల్తానా, ఎండి సనావుల్లా షరీఫ్, కైకలూరు మండలం కొత్తపేట ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న హసీనా సుల్తానా, ఏలూరురూరల్ మండలం శనివారపుపేట ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న ఎస్కే .అన్వర్ జహాన్‌లకు రాష్ట్ర ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. పశ్చిమగోదావరి జిల్లానుంచి తాడేపల్లిగూడెం సంజీవరెడ్డినగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న ఎండి.సిరాజ్ ఎంపికయ్యారు. వీరందరికీ అవార్డులను ఈ నెల 11న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకల్లో సీఎం చంద్రబాబు అందించనున్నారు.

కొండెక్కిన కూరగాయలు



తాడేపల్లిగూడెం, ఏలూరు టూటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొనలేం.. తినలేం.. అన్నట్లుగా కూరగాయల ధరలు రోజురోజుకి పెరుగుతున్నాయి. సామాన్యులకు ధరలు అందుబాటులో లేక విలవిల్లాడుతున్నారు. 15 రోజులుగా ఇదే పరిస్థితి. కూరగాయలు ధరలు దిగిరావడం లేదు. వారం వారానికి పెరుగుతూనే పోతున్నాయి. గత వారంతో పోల్చుకుంటే ఒక టమాటా తప్ప మిగిలిన కూరగాయల ధరలు పెరిగాయి. వాతావరణంలో వచ్చిన మార్పుతో దిగుబడి తగ్గింది. మొంథా తుఫాన్ ప్రభావంతో లంక ప్రాంతాల్లోని తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీనికి తోడు కార్తీకమాసం జత కావడంతో కూరగాయల ధరలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇదే సమయంలో మార్కెట్‌కు వచ్చే కూరగాయలకు మంచి డిమాండ్ వచ్చిపడింది.

అన్నీ పైపైకే

తాడేపల్లిగూడెం మార్కెట్‌లో ఆదివారం ధరలు ఉన్నాయి. కిలో వంకాయలు రూ.120, బెండ రూ.80, బీర కాయలు రూ.80., దొండకాయలు రూ.80, దోస కాయలు రూ.50, కాకరకాయలు రూ.60, ఆగాకర కాయలు రూ.120, పచ్చిమిర్చి రూ.60, క్యాప్సికం రూ.100, క్యారెట్ రూ.80, బీట్‌రూట్ రూ.80, క్యాబేజీ రూ.40 అమ్ముతున్నారు. ఇక టమాటా విషయానికొస్తే గత వారంతో పోల్చుకుంటే కిలోకి రూ.10 తగ్గింది. గత వారం కిలో రూ.40 ఉంటే ఈ వారం రూ.30కి విక్రయించారు. కాలీఫ్లవర్ పువ్వు రూ.40, జత మునగకాడలు రూ.30, అరటికాయలు జత రూ.20కు అమ్మారు. ఉల్లి ధర మాత్రం స్థిరంగానే ఉంది. నాణ్యమైన మహారాష్ట్ర ఉల్లి పెద్ద సైజు రూ.100కు నాలుగు కిలోలు, మధ్యరకం ఉల్లి రూ.100కు 5 కిలోలు అమ్మారు. నాఫెడ్ ఉల్లి మాత్రం రూ.100కు 6 కిలోలు ఇస్తున్నారు.

దిగిన చికెన్

చికెన్ ధరలు గతవారంతో పోల్చుకుంటే తగ్గింది. స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.240 నుంచి 220, విత్ స్కిన్ కిలో రూ.220 నుంచి 200కు దిగింది. కార్తీకం ప్రభావంతోనే తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

ఏలూరు రైతుబజారులో ఇలా..

ఏలూరు రైతుబజారులో వంకాయల ధరలు కిలో రూ.70 పలుకుతున్నాయి. బెండకాయలు రూ.54, కాకరకాయలు రూ.58, దొండకాయలు రూ.56, గోరుచిక్కుడు రూ.58, చిక్కుడు కాయలు రూ.120, క్యారెట్ రూ.60, దోసకాయ రూ.30, పొట్లకాయ రూ.25 ఉన్నాయి. రూ.కొత్తమీర కట్ట రూ.35, మిగిలిన ఆకుకూరలు కట్ట రూ.15 అమ్ముతున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఇవే కూరగాయలు రూ.10 నుంచి 20 అదనంగా అమ్ముతున్నారు.



దివ్యాంగులకు మూడు చక్రాల సైకిల్ అందిస్తున్న కలెక్టర్ నాగరాణి , ఆరిమిల్లి కృష్ణతులసీ

దాతృత్వానికి మారు పేరు పశ్చిమ

దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో కలెక్టర్ నాగరాణి

తణుకు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా అంటేనే దాతృత్వానికి మారుపేరు అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆదివారం డాక్టర్ పీఎస్ఎస్ కిరణ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కమ్మ కల్యాణ మండపంలో దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కిరణ్ ఫౌండేషన్ ఛైర్మన్ సతీష్ బొల్లా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ కిరణ్ ఫౌండేషన్ చెర్మన్ సతీష్ బొల్లా తన స్నేహితుడి పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి దివ్యాంగులకు వెన్నెంటి ఉంటూ వారి అవసరాలను తీర్చుతూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులకు సేవ చేయాలనే లక్ష్యంతో వారికి కృత్రిమ అవయవాలు అందించడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సహకారంతో దివ్యాంగులకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసీ మాట్లాడుతూ దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఏర్పాటు చేసిన సంకల్పం-2025 కార్యక్రమం ద్వారా ఎంతో అద్భుతమైన అనుభూతిని పొందగలిగానని తెలిపారు. తణుకు ప్రాంతంలో దాతృత్వం కలిగిన దాతలు ఉన్నారంటే గర్వకారణంగా ఉందన్నారు. భవిష్యత్ తరాలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు స్ఫూర్తి దాయకం అన్నారు. ఎమ్మెల్యే రాధాకృష్ణ న్యూజిలాండ్ నుంచి వీడియో సందేశాన్ని పంపారు. అనంతరం 100 మందికి కృత్రిమ అవయవాలను అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతో అమరావతికి పునరుజ్జీవం

ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ



న్యూజిలాండ్ ఎన్ఆర్ఐ సమావేశంలో మాట్లాడుతున్న ఆరిమిల్లి

తణుకు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ళ వైసీపీ పాలనలో అమరావతిని వైఎస్ జగన్ భ్రష్టు పట్టించారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ విమర్శించారు. ఆదివారం న్యూజిలాండ్‌లోని ఎన్నారై టీడీపీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తిరిగి చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అమరావతికి పునర్జీవం పోశారని చెప్పారు. అమరావతి నిర్మాణంలో పరిపాలనా భవనాలు నిర్మిస్తున్నారని తెలిపారు. గతంలో 70 శాతం అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేశారని, తర్వాత అధికాంలోకి వచ్చిన జగన్‌రెడ్డి కనీసం 6 శాతం పనులు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. మరోవైపు పోలవరం నిర్మాణాన్ని సైతం చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారని వివరించారు. సీబీఎన్ అనే మూడు అక్షరాలు రాష్ట్రానికి బ్రాండ్ భవిష్యత్ అన్నారు. అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో 16 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. జగన్ శాశ్వతంగా ముఖ్యమంత్రిగా ఉంటానని భావించి రూ.500 కోట్లతో ప్యాలెసు నిర్మించుకున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో విశాఖకు పెట్టుబడులు పెట్టేందుకు ఎంతోమంది ముందుకు వస్తున్నారని చెప్పారు.

పాలకొల్లులో ఉత్సాహంగా టెన్నిస్ పోటీలు

క్వాలిఫై అయిన 32 మంది క్రీడాకులు

పాలకొల్లు టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కాస్మోకల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్‌లో జరుగుతున్న ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు రెండవ రోజు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. శని, ఆదివారాల్లో పోటీలు నిర్వహించగా క్వాలిఫై పోటీల్లో 32 మంది మెయిన్ డ్రాకు ఎంపికై నట్టు ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజు (బూన్‌రాజు) తెలిపారు. క్వాలిఫైయింగ్ మ్యాచ్‌ల్లో 82 మంది క్రీడాకారులు (45, 55, 65, 70 సంవత్సరాల వయస్సు) పాల్గొన్నారని తెలిపారు. సీనియర్స్ టెన్నిస్ ర్యాంకింగ్ ఉన్న వివిధ రాష్ట్రాలకు చెందిన 72 మంది సోమవారం ఉదయం 8 గంటల నుంచి నరసాపురంలోని 2 కోర్టుల్లోనూ, పాలకొల్లులోని 2 కోర్టులలోనూ ఆడతారని తెలిపారు. పోటీలకు అంపైర్లుగా వినుకొండ దినేష్ (నరసాపురం), పి.వర్మ (పాలకొల్లు), ఎన్ శ్రీనివాసరాజు(నరసాపురం), కిరణ్ (పాలకొల్లు) వ్యవహరిస్తారని, మ్యాచ్ చీఫ్ రిఫరీగా హైదరాబాద్‌కు చెందిన సంతోష్ వ్యవరిస్తారని బూన్‌రాజు వివరించారు. సోమవారం సాయంత్రం జరిగే కార్యక్రమంలో మంత్రి నిమ్మల ముఖ్య అతిథిగా హాజరవుతారని, కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు అధ్యక్షత వహిస్తారని తెలిపారు.

అట్టడుగు వర్గాలకు ఉచిత న్యాయసేవలందాలి

ఏలూరులో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

ఏలూరు క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అట్టడుగు వర్గాలకు, ఆపదలో ఉన్న వారికి, వృద్ధులకు, విభిన్న ప్రతిభావంతులకు, బాలలకు, స్త్రీలకు న్యాయసేవలు అందించడంలో న్యాయ సేవాధికార సంస్థలు సఫలీకృతమయ్యాయని ఏలూరు జిల్లా 7వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస రావు అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఎ భవనంలో ఆదివారం నిర్వహించారు. శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఉచిత న్యాయ సేవలను సమాజంలో మారుమూల జీవిస్తున్న ప్రజలకు చేరువ్వడానిక ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు న్యాయ సేవాధికార సంస్థలు ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తాయన్నారు. అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు వారికి ఉచిత న్యాయ సేవలను అందించడంలో న్యాయ సేవాధికార సంస్థలు ఎంతో కృషి చేస్తున్నాయని ముఖ్యంగా క్రిమినల్ కేసులలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ సేవలను అందిస్తున్నారని బడుగు, బలహీన వర్గాల వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ మాట్లాడుతూ గత నవంబర్ 9వ తేదీ నుంచి నేటి వరకు 18,000 పై బడి కేసులను లోక్ అదాలత్ ద్వారా రాజీ చేశామని, ప్రత్యేక మధ్యవర్తిత్వం ద్వారా గత మూడు నెలల నుంచి వివిధ కేసులలో ఇరుపక్షాలకు కౌన్సెలింగ్ నిర్వహించి 200కు పైగా కేసులను రాజీ చేశామన్నారు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందడంలో న్యాయపరమైన సమస్య ఎదురైన వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించాలని సూచించారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి సాయితేజ మాట్లాడుతూ క్రిమినల్ కేసులతో పాటు సివిల్ కేసులను కూడా పరిష్కరించుకోవడానికి కక్షిదారులు ముందుకు రావాలని అలాగే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత సేవలను ప్రజలకు చేరువ చేయడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని సూచించారు. ఏలూరు అడ్వకేట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారామ్, ప్రభుత్వ న్యాయవాది బీజే రెడ్డి , రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు లీలా కృష్ణ, పోలీస్ అధికారులు, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా మావుళ్లమ్మ పడిపూజ

భీమవరం టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మావుళ్లమ్మ అమ్మవారి దీక్ష తీసుకున్న భక్తుల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి భీమవరం మావుళ్లమ్మ ఆలయం వద్ద భారీ సెట్టింగ్‌తో అమ్మవారికి వైభవంగా పడిపూజ నిర్వహించారు. ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి హారతులను అందించారు. అమ్మవారి నామస్మరణతో ఆ ప్రాంతం మారు మోగింది.అమ్మవారి భక్తులచే నిర్వహించిన భజన కార్యక్రమంతో ఆధ్యాత్మిక నిండిపోయింది. ఈవో బుద్దామహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు.



పడిపూజలో పాల్గొన్న భక్తులు,మాలధారులు



డిస్పోజబుల్, ప్లాస్టిక్ గొడౌన్‌లో అగ్నిప్రమాదం

సుమారు రూ. రెండు లక్షల ఆస్తి నష్టం

జంగారెడ్డిగూడెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జంగా రెడ్డిగూడెం పట్టణంలో రెండంతస్తుల భవనంలో ఆదివారం అగ్నిప్రమాదం జరగడంతో ఆ భవనంలో నివాసం ఉండేవారితో పాటు చుట్టుపక్కల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. బుట్టాయగూడెం రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద రాజస్థాన్‌కు చెందిన శంకర్ అనే వ్యక్తి కొన్నేళ్లుగా డిస్పోజల్ గ్లాసులు,ప్లేట్లు మొదలైన వస్తువులను గ్రామాల్లో ఉన్న కిరాణా, ఫ్యాన్సీ దుకాణాలకు హోల్‌సేల్‌గా సరఫరా చేస్తున్నాడు. పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా కొంకిమళ్ళ రాజ్ కుమార్ అనే వ్యక్తి కు చెందిన భవనంలోని మొదటి ఫ్లోర్‌లో కొంత భాగం గొడౌన్ నిమిత్తం శంకర్ అద్దెకు తీసుకున్నాడు. అదే భవనంలో రెండవ అంతస్తులో భవన యజమాని రాజ్‌కుమార్, శంకర్ కుటుంబం కూడా నివాసం ఉంటున్నారు.ఆదివారం సాయంత్రం మొదటి అంతస్తులోని కిటికీలో నుంచి పొగలు రావడంతో స్థానికులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడకు వచ్చిన అగ్నిమాపక సిబ్బంది, ఎస్సై ఎస్.వీర ప్రసాద్ మంటలను అదుపు చేశారు. దట్టమైన పొగ కమ్మేయడంతో అందులో నివాసం ఉండే వారంతా రాత్రంతా ఇంటి బయటే ఉండవలసి వచ్చింది. గొడౌన్ యజమాని అందుబాటులోకి రాలేదని అగ్నిమాపక శాఖాధికారి జి.అబ్రహాం తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగి ఉంటుందన్నారు. సుమారు రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని భావిస్తున్నట్లు తెలిపారు.



ద్వారకాతిరుమల మండలం రామన్నగూడెం పరిధిలోట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎస్సై సుధీర్

ట్రాన్స్‌ఫార్మర్లు పగులకొట్టి కాపర్ వైరు చోరీ

ద్వారకాతిరుమల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంటపొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను పగలకొట్టి చేసి కాపర్ వైర్లను దోచుకెళ్లడం ద్వారకాతిరుమల మండలంలో ఇటీవల ఎక్కువయ్యాయి. ఆదివారం మండలంలోని రామన్నగూడెం పంచాయతీ పరిధిలో ఇటువంటి దొంగతనం వెలుగుచూడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు నష్టపోవడమే కాకుండా సకాలంలో పంటలకు తడి అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రామన్నగూడెం పంచాయతీ పరిధిలో ఇద్దరు రైతులకు చెందిన పొలంలో శనివారం అర్థరాత్రి కొందరు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్‌వైరు తస్కరించారు.రైతులు సయ్యద్ బడే సాహెబ్, కొడవగంటి ఆనందరావులు ఆదివారం ఉద యం పొలంలోకి వెళ్లి చూసేసరికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ధ్వంసమై కన్పించాయి. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సుధీర్ ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు.

క్రైం కార్నర్

మద్యం తాగద్దన్నందుకు ఆత్మహత్య

పెదవేగి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుక్క కాటుకు గురైన వ్యక్తిని మద్యం తాగవద్దని చెప్పినందుకు మనస్థాపానికి గురైన వ్యక్తి కలుపు నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. ముండూరు శివారు వెంగంపాలెం గ్రామానికి చెందిన చలపాటి వెంకటేశ్వరరావు నిత్యం మద్యం సేవిస్తుంటాడు. అతనిని కొద్దిరోజుల కిందట కుక్క కరించింది. దీంతో మద్యం తాగవద్దని అతని భార్య చెప్పింది. మనస్థాపానికి గురైన వెంకటేశ్వరరావు శనివారం సాయంత్రం కలుపు నివారణకు ఉపయోగించే మందును తాగేశాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వెంకటేశ్వరరావు (77) ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆరుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

పెదవేగి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పేకాట జరుగుతుందనే సమాచారంతో దాడిచేయగా ఆరుగురు జూదరులు దొరికారని పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. లక్ష్మీపురం పంచాయతీ ఎంఆర్‌సీ కాలనీలో పేకాట ఆడుతున్న పక్కా సమా చారంతో దాడి చేశామని, ఈ సమయంలో పేకాట రాయుళ్లు పారిపోతుండగా వెంబడించి ఆరుగురు జూదరులను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.7150 స్వాధీనం చేసుకున్నకట్టు ఎస్ఐ చెప్పారు.

టి.నర్సాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు ఆదివారం తెలిపారు. మక్కినవారిగూడెం పంచాయతీలోని కొల్లివారిగూడెం గ్రామానికి చెందిన కసిని నాగమణికి (30) వివాహమైంది. ఇద్దరు సంతానం. నాగమణి మక్కినవారిగూడెంలో బట్టల షాపు పెట్టి నడుపుతోంది. అప్పు తెచ్చి స్టాక్ తీసుకు రావద్దని ఇప్పటికే చాలా అప్పులు అయ్యాయని ఉన్న సరుకునే అమ్ముకోమని భర్త మందలించటంతో నాగమణి ఈనెల 6వ తేదీ సాయంత్రం 4 గంటలకు బట్టషాపు దగ్గరకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినప్పటికి ఆమె ఆచూకీ తెలియలేదు. నాగమణి తండ్రి గోపిన మద్దిరాములు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్‌పై వెళ్తున్న వారిని మరో మోటారు సైకిల్ ఢీకొనడంతో ఒక వ్యక్తి తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఏలూరు కుమ్మరరేవునకు చెందిన మెడే కృష్ణ (45) టైల్స్‌పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం ఉదయం తన స్నేహితుడైన రాజును ఎక్కించుకుని మార్కెట్‌కు వెళ్ళాడు. పర్సు ఇంటి వద్ద మర్చిపోవడంతో తిరిగి పర్సుకోసం ఇంటికి వెళ్ళే నిమిత్తం వసంతమహల్ వద్ద మోటారు సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా ఒక బులెట్ అతి వేగంగా ఢీకొనడంతో కృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.



అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

భీమవరం క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భీమవరం నుంచి ఏలూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ఆగిపోయింది. డివైడర్ లేకపోతే అక్కడ పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు చెబుతున్నారు. సుమారు 30 మందితో వెళ్తున్న ఏలూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదివారం మధ్యాహ్నం ప్రమాదానికి గురైంది. బస్సులో ఉన్నవారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల కాలంలో వరుస బస్సు ప్రమాదాలు ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. బస్సు ఎక్కాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి.

సంచార శకటంతో వైద్య సేవలు

తణుకు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోషియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించే ఉచిత సంచార శకటం ద్వారా వైద్య సేవలు ఆదివారం ప్రముఖ వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య తణుకులో పర్యటించి 8మంది వృద్ధులకు వైద్య సేవలందించారు. సంఘ సభ్యుడు ఆకుల వెంకటేశ్వరరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు.

ఆంధ్రజ్యోతి
భీమవరం
భీమవరం, ఉండి, తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, పాలకొల్లు, నరసాపురం

ఉచిత ఆక్యుపంచర్ శిబిరం

నరసాపురం టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీహరి పేటలో ఆదివారం కొవ్వలి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా అక్యుపంచర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు కొండా శ్రీధర్ 100 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధుల్ని ఆక్యుపంచర్ వైద్యం ద్వారా నయం చేసుకోవచ్చున్నారు. ట్రస్టు కోశాధికారి జయలక్ష్మి, సంకు భాస్కర్, చిన్నాయమ్మ, సురేష్, రేఖ, రెడ్డి, ముత్యం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి : కలెక్టర్

తణుకు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వసతి గృహంలో చదువుకున్న ఎంతోమంది ప్రయోజకులయ్యారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆదివారం పట్టణంలోని 13వ వార్డు ఇరగవరం కాలనీలోని బాలికల వసతి గృహంను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రూ. 10 లక్షలు ప్రత్యేక నిధులతో హౌసింగ్ కార్పొరేషన్ పర్యవేక్షణలో వసతి గృహం ఆధునికీకరణ పనులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందుతోందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, చిన్ననాటి నుంచి లక్ష్యం ఏర్పరచుకుని దానికి అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. జిల్లా గృహ నిర్మాణశాఖాధికారి జి.పిచ్చియ్య, తహసీల్దార్ అశోక్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడు 'యర్రంశెట్టి' పరిశోధనలు ఆదర్శం

పాలకొల్లు టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిత్యం బోధనతోపాటుగా ఎలక్ట్రానిక్స్, భౌతిక, సామాజిక అంశాలపై పరిశోధనలు చేయడమే కాక తనచుట్టూ ఉన్న పరిస్థితులపై కూడా అధ్యయనం చేయడం ఆదర్శమని కోనసీమకు చెందిన అధ్యాపకుడు డాక్టర్ యర్రంశెట్టి విజయసత్యప్రసాద్‌ను మంత్రి రామానాయుడు అభినందించారు. కోనసీమ జిల్లా కేశనపల్లి ప్రాంతం ఉప్పునీటి ప్రభావంతో ఎదుర్కొంటున్న తీవ్రమైన పర్యావరణ, సామాజిక ఆర్థిక సంక్షోభంపై యర్రంశెట్టి చేసిన పరిశోధనపై ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ రీసెర్చ్ ఇన్, ఇంజనీరింగ్, సైన్స్‌లో ప్రచురితమవడంతో పరిశోధన ప్రతులను మంత్రికి పాలకొల్లు క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనను అభినందించారు. గిడుగు శేఖర్, పీతల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం : వలవల



సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న వలవల బాబ్జి

పెంటపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని భవన నిర్మాణ, ఇతర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద లబ్దిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. తొలుత జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పుట్టిన రోజు సందర్భంగా కేకు కట్ చేశారు. గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న పాల్గొన్నారు.

'ఆదిత్య' విద్యార్థుల స్వచ్ఛభారత్

ఉండి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మలేరియా నివారణకు తీసు కోవలసిన జాగ్రత్తలు, పరిశుభ్రతపై భీమవరం ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రత్యేక అవగాహన కల్పించారు. తొలుత గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధులు శుభ్రపరిచారు. శుభ్రమైన పరిసరాలు ఆరోగ్యానికి మూల మని వలంటీర్లు ప్రజలకు సందేశమిచ్చారు. ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అనూరాధ, వైస్ ప్రిన్సిపాల్ బి.మావుళ్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బ్రహ్మం విద్యార్థులను అభినందించారు.

'పెనుగొండ పేరు మార్పు తగదు'

పెనుగొండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజాభిప్రాయం సేకరించకుండా పెనుగొండ పేరును మార్పు చేయడం తగదంటూ ప్రభుత్వానికి హైకోర్టు అడ్వొకేట్ ఇండుగపల్లి రామానుజం హితవు పలికారు. ఆదివారం పెనుగొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెనుగొండ ప్రజల ఆత్మగౌరవాన్ని భంగం పరిచే విధంగా నిర్ణయం తీసుకుంటున్నారన్నారు. పంచాయతీ సమావేశంలో పెనుగొండ పేరును మార్పును వ్యతిరేకిస్తూ తీర్మానాన్ని తిప్పి కొట్టారన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

భీమవరంటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణంలో ఈ నెల 14 నుంచి 20 వ తేదీ వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ అభివృద్ధి కమిటీ, వారోత్సవాల పూర్వ కమిటీ సంయుక్త అధ్వర్యంలో నిర్వహిస్తున్నామని నిర్వాహక కమిటీ గౌరవాధ్యక్షుడు జగపతిరాజు, అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. ఆదివారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వారం రోజులపాటు విద్యార్థులకు పలు పోటీలు, గ్రంథాలయాల పట్ల అవగాహన ర్యాలీ, 20న క్విట్ ఇండియా స్తూపం వద్ద ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

ఉమాసోమేశ్వరస్వామికి లక్షపత్రి పూజ

యలమంచిలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఉమాసోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారికి లక్షపత్రి పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు యలమంచిలి నరేంద్రశర్మ నేతృత్వంలో వేదపండితులు స్వామికి అభిషేకాల అనంతరం మారేడు బిల్వాలతో లక్షపత్రి పూజ చేశారు.

ముత్యాలమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

మొగల్తూరు. నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు కృష్ణా జిల్లా నుంచి అమ్మవారి దర్శనానికి భారీగా తరలివచ్చారు. ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఈవో అరుణ్ కుమార్ ఏర్పాట్లు చేశారు.

బోట్ల డీజిల్ సబ్సిడీకి బ్రేక్..!

(5వ పేజీ తరువాయి)

ఒక్కప్పుడు 20 వరకు ఉండేవి. ప్రస్తుతం వీటి సంఖ్య ఐదు మాత్రమే. ఫైబర్ బోట్లు అధికారుల లెక్కల ప్రకారం 140 వరకు ఉన్నాయి.

19 కిలోమీటర్ల సముద్రతీరం

జిల్లాలో నరసాపురం, మొగల్తూరు మండలాల్లో 19 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. 20 వేల మందికి పైగా మత్స్యకారులు ఉన్నప్పటికీ వీరిలో కొద్ది మంది మాత్రమే సముద్ర వేట సాగిస్తున్నారు. దీని కోసం రెండు రకాల బోట్లను ఉపయోగిస్తారు. ఇందులో ఒకటి సోనా బోటు. దీనిపై పది మంది వరకు మత్స్యకారులు ఉంటారు. రెండోది ఫైబర్ బోటు. దీనిపై ఐదుగురు వరకు వేట సాగిస్తారు. వీరు సముద్రంలో కొద్ది దూరం మాత్రమే వెళతారు. రెండు నుంచి మూడు రోజులు మాత్రమే సముద్రంలో ఉంటారు.

ఆర్థిక సంఘం నిధులు ఎప్పుడిస్తారు ?

(5వ పేజీ తరువాయి)

మిగిలిన పనులు పూర్తి చేయాలని సర్పంచ్‌లు భావిస్తున్నారు. దీనికి ఆర్థిక సంఘం నిధులు ఉపయోగపడతాయని భావిస్తున్నారు.

ఆర్థిక సంఘ నిధుల కోసం

నిధులు లేక ఇబ్బంది పడుతున్నాం. ఆర్థిక సంఘం నిధులు వస్తే గ్రామంలో మంచినీటి పైపులైన్ల పునరుద్ధరణ, కల్వర్టుల నిర్మాణం చేపట్టాలి. ఇవి పూర్తి చేస్తే మా హయాంలోనైనా కొన్ని పనులు పూర్తి చేశామనే సంతృప్తి మిగులుతుంది.

- ముప్పిడి సూర్యకుమారి, సర్పంచ్ మాధవరం

ఆర్టీసీలో పదోన్నతులకు రైట్‌రైట్

(5వ పేజీ తరువాయి)

ప్రాతిపదిక డీపీటీవో అర్హుల జాబితాను సిద్ధం చేశారు. 10వ తేదీ సోమవారం ఉదయం పది గంటలకు విజయవాడ ఆర్టీసీ ఈడీ కార్యాలయంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్-2కు కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతులు కల్పిస్తారు. తర్వాత విజయవాడ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మిగిలిన కేడర్లలో పదోన్నతులు జరుగుతాయి. జిల్లాలో ఖాళీగా ఉన్న డీసీటీఐ 22 మంది, ఏడీసీలు 87, ఎనిమిది మంది లీడింగ్ హ్యాండ్ (ఎల్‌హెచ్), టెక్నికల్ ఏడీసీలు 6, గ్రేడ్-1 డ్రైవర్లు 81, గ్రేడ్-1 కండక్టర్లు 91 మంది, మెకానిక్ గ్రేడ్-1 15 మంది, టైర్ మెకానిక్ గ్రేడ్ వన్ -4, గ్యారేజీల్లో పనిచేసే ఆర్టిజన్స్ గ్రేడ్-1, ఆర్టిజన్స్ గ్రేడ్ -2 ముగ్గురు, డిప్యూటీ మెకానిక్‌లు ఆరుగురికి పదోన్నతులకు అవకాశం ఉంది.



పాలకొల్లు వన సమారాధనలో విజేతలకు బహుమతులిస్తున్న మంత్రి నిమ్మల



గణపవరంలో ఎమ్మెల్యే ధర్మరాజును సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు



భీమేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధనను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు



పాలకోడేరు ఎస్‌ఐలకు సత్కారం

ఐక్యతకు వన సమారాధనలు దోహదం

» పలు సంఘాల ఆధ్వర్యంలో వనసమారాధనలు » ఆటపాటలతో గడిపిన కుటుంబాలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీక వన సమారాధనలు సంఘ సమైఖ్యతకు దోహద పడతాయని రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక ఏఎంసీ ఆవరణలో ఆదివారం మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనసమారాధనలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలు, బాల బాలికలకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు మంత్రి నిమ్మల బహుమతులు అందజేశారు. సంఘ అధ్యక్షుడు కాగిత సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ సభ్యులు పలువురు పాత్రికేయులను ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీలు అంగర రామమోహన్, మేకా శేషుబాబు, ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు. ఇంద్రజాలికుడు మధు ఇంద్రజాల ప్రదర్శన ఆకట్టుకుంది.

గణపవరం: పగ, ద్వేషం, రాజకీయ వైషమ్యాలను రూపుమాపేందుకు వనసమారాధనలు ఎంతగానో దోహదపడతాయని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం గణపవరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వనసమారాధనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆర్యవైశ్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు ఆటపాటలతో ఆర్యవైశ్యులు గడిపారు. ఆర్య వైశ్య నాయకులు, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పెనుగొండ: శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెనుగొండలోని మార్కెట్ యార్డులో కార్తీక వన సమారాధన నిర్వహించారు. పిల్లలకు లెమన్ అండ్ స్పూన్, మహిళలకు మ్యూజికల్ చైర్స్ కార్యక్రమం నిర్వహించారు.

భీమవరంటౌన్: వన సమారాధనలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం బ్యాంక్ కాలనీలోని కోపా కళ్యాణ మండలంలో కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్తీక వన సమారాధనను ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడుతూ సామాజిక సేవలో కోపా ముందుంటుందన్నారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన వారిని సత్కరించారు. పలువురికీ విద్య పురస్కారాలను అందించారు. అడబాల హనుమాన్ దంపతులు, టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, యారంశెట్టి హరి నాథ్, కోపా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

●కార్తీక మాసంలో శివుని దర్శనం ఎంతో పుణ్య ఫలమని, ఈ మాసంలో స్వామి అన్న ప్రసాదాన్ని స్వీకరించడం ఎంతో అదృష్టమని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. భీమే శ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా పట్టణానికి చెందిన మరిడి చక్రధరరావు దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక వన సమారాధనను ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం భారీ సంఖ్యలో భక్తులు స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ చైర్మన్ గనిరెడ్డి త్రినాథ్, ఈవో తోట శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం ఏపీ నిట్ సమీపంలో యాదవ సంఘం కార్తిక వనసమారాధనలో నియోజకవర్గంలోని యాదవ కుటుంబాలు పాల్గొన్నాయి. వన సమారాధనకు భవన నిర్మాణ, ఇతర కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి, మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, జనసేన యువ నాయకుడు బొలిశెట్టి రాజేష్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమా లను యాదవ సంఘం అధ్యక్షుడు నెక్కల్ల తాతాజీ, సంఘ నాయకులు కిల్లాడి ప్రసాద్, నీలపాల దినేష్ యాదవ్, కాళ్ల గోపికృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

ఆకివీడు: స్థానిక శాంతినగర్ నూకాలమ్మ ఆలయ నిర్వాహకుడు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా నేతృత్వంలో అఖండ వనసమారాధన నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామ వర ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు, మండల ప్రధాన కార్యదర్శి నౌకట్ల రామారావు, మండలాధ్యక్షురాలు బచ్చు సరళాకుమారి, మండల సమాఖ్య అధ్యక్షురాలు బొర్రా సుజాత, కౌన్సిలర్ బత్తుల శ్యామల, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కళ్యాణ మందిరంలో అన్న సమారాధన నిర్వహించారు.

పాలకోడేరు: పాలకోడేరు శివారు గోస్తనీ నది ఆలయ ప్రాంగణంలో శెట్టిబలిజ సంఘస్తులు ఆదివారం కార్తీక వనసమారాధనను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉసిరిచెట్టుకు పూజ చేశారు. అనంతరం మిమిక్రీ రాంబాబు మిమిక్రీ షో నిర్వహించారు. పిల్లలకు ఆట, పాటలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పాలకోడేరు ఎస్‌ఐలు ఇద్దరిని సత్కరించారు.

మొగల్తూరు: మొగల్తూరులో గాయత్రీ బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక శిష్టావారి ప్రాంగణంలోనూ ఏర్పాటు చేసిన వన సమారాధనకు పలు గ్రామాల్లోని బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు భారీగా తరలివచ్చారు. ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయ సమీపంలో అగ్నికుల క్షత్రియుల వన సమారాధనకు భారీగా సంఘస్థులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి మోపిదేవి వెంకట రమణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి వెంకట రమణ, మత్స్యకార సంఘాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొప్పాడ రవీంద్రతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన రాష్ట్ర నాయకులను ఘనంగా సన్మానించారు.

నరసాపురం టౌన్: దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధనకు విప్ నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి రామరాజు, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వన సమారాధనల వల్ల సంఘాల్లో ఐక్యత మరింత పెరుగుతుందన్నారు. మావూరి ఆనంద్, దేశెట్టి సత్యనారాయణ, అప్పలస్వామి, కనకం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి సురేష్‌బాబు

చట్టాలను అతిక్రమిస్తే చర్యలు

భీమవరం క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల హక్కుల పరిరక్షణకు చట్టాలు రూపొందించారని, వాటిని అతిక్రమిస్తే శిక్షార్హులని భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జి.సురేష్‌బాబు అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో స్పెషల్ సబ్ జైల్‌లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సురేష్‌బాబు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ నేరానికి పాల్పడే ముందు సమాజం దృష్టిలో తాను, తన కుటుంబ సభ్యులు జీవితాంతం గౌరవాన్ని కోల్పోవాల్సి వస్తుందని ఆత్మపరిశీలన చేసుకుంటే నేరం చేయాలంటే భయం కలుగుతుందని అన్నారు. ఆర్థిక స్థోమత లేక న్యాయవాదిని పెట్టుకోలేకపోతే జైలు అధికారుల ద్వారా మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని అన్నారు. జైలు సూపరింటెండెంట్ డి.వెంకటగిరి జైలులో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. భోజనాన్ని, బియ్యం, పప్పు దినుసులను న్యాయాధికారి పరిశీలించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి యోహాన్ (న్యూటన్), ప్యానల్ న్యాయవాదులు అంబేద్కర్, సుధీర్, రవికిరణ్, విజయలక్ష్మి, సత్యనారాయణరాజు, చంద్రరావు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చట్టం అందరికీ సమానమే



మాట్లాడుతున్న న్యాయమూర్తి రంజిత్ కుమార్

తణుకు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చట్టం ముందు అందరూ సమానమేనని తణుకు మొదటి జూనియర్ సివిల్ జడ్జి పీవీఎస్ రంజిత్ కుమార్ అన్నారు. ఆదివారం న్యాయ సేవల దినోత్సవం పురస్కరించుకుని బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. జాతీయ న్యాయ సేవల చట్టంతో యాసిడ్ ఎటాక్ లాంటి బాధితులకు పరిహారాలు కూడా అందిస్తోందన్నారు. న్యాయవాదులు పోణంగి శ్రావణి సమీరా, కుమారి ఎస్‌కె మోతి, కౌరు వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ పథకం బీసీలకు వరం

పెనుమంట్ర, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆదరణ పథకం బీసీ లకు వరంగా నిలుస్తుందని రాష్ట్ర దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాజకీయ విభాగం కో ఆర్డినేటర్ అల్లాడ సూర్య భాస్కర్ రావు అన్నారు. ఆదివారం మార్టేరు లో ఆయన మాట్లాడుతూ చేనేతల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. చేనేత వృత్తిని ప్రోత్సహించే క్రమంలో నారా వారి కుటుంబం చేనేతలకు బ్రాండ్ అంబాసిడర్ గా నిలవడం ఎంతో శుభ పరిణామమన్నారు.



ఘనంగా అయ్యప్ప పడిపూజ

భీమవరం టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భక్తికి క్రమశిక్షణ తోడైతే ఆధ్యాత్మికత ఎంతగా పరిమళిస్తుందో తెలియజేసేదే అయ్యప్ప దీక్ష అని గురుస్వాములు తోట రామకృష్ణ, నల్లా వీరభద్రరావు అన్నారు. స్థానిక మెంటేవారి తోటలోని పాండురంగస్వామి, విజయ గణపతి ఆలయాల సమీపంలో నిర్వహించే 18వ పడిపూజ దగ్గ రకు కాపిశెట్టి ఆనంద్, అజయ్‌కుమార్ నేతృత్వంలో 94 మంది కన్నెస్వాములు కలశాలతో ఊరేగింపుగా వచ్చారు. సల్లాది శివస్వామి మహా పడిపూజ, భజన నిర్వహించారు. పడిపూజను ఎమ్మెల్యే అంజిబాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాసరావు, రవితేజ, గురుస్వామి రామరాజు తదితరులు ఉన్నారు.

తాగునీటి అభివృద్ధి పనులకు రూ. 35 కోట్లు : మంత్రి నిమ్మల




స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

యలమంచిలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గతంలో యలమంచిలి మండలానికి తాగునీటి అభివృద్ధి పనులకు సంబంధించి రద్దయిన జలజీవన్ మిషన్ నిధులు రూ.35 కోట్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే తీసుకువచ్చానని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని కలగంపూడి గ్రామం లో రూ.55 లక్షలతో చేపట్టనున్న జల జీవన్ మిషన్ పనులకు మంత్రి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్నప్పుడు తాగునీటి సమస్యను మహిళలు ప్రస్తావించారని, కుళాయిల ద్వారా వచ్చే నీరు మొక్కలకు పెట్టుకోవడానికి ఉపయోగించుకోవాల్సి వస్తోందని, అన్నం వండడానికి వాడితే రంగు మారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ప్రజల రుణం తీర్చుకోవడానికి తాగునీటి అవసరాలకు అధికప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. టీడీపీ నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, ముచ్చర్ల శ్రీనివాసరావు, ఆరుమిల్లి రామశ్రీనివాస్, చిలుకూరి బాలాజీ, రాయి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో వినయం..

పాలకొల్లు టౌన్: విద్యతో వచ్చేది వినయం.. పంచితే పెరిగేది విద్య అని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం శ్రీ కృష్ణదేవరాయ కాపు, తెలగ, బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ స్కాలర్ షిప్పుల పంపిణీ (ఆంధ్ర, తెలంగాణ విద్యార్థులు 80 మందికి స్కాలర్ షిప్‌ల పంపిణీ) కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేశారు. కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు బోనం నరసయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎన్ఆర్ఐలు పంపిన చెక్కులను ఉత్తమ విద్యార్థులకు ఒకొక్కరికి 150 డాలర్లు చొప్పున (సుమారు 13 వేలు) అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యుఎస్ఏ మన అమెరికా తెలుగు అసోసియేషన్ (మాట) ఫౌండర్ సెక్రటరీ అద్దేపల్లి వెంకటరావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ రావు, వంగా నరసింహారావు, అల్లు పీర్లస్వామి, గురుజు మరేశ్వరరావు, చవాకుల సూర్య నరేష్ బాబు, శ్రీహరి, వినాయకస్వామి తదితరులు పాల్గొన్నారు.





వైభవంగా లక్ష దీపోత్సవం

భీమవరంటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, సాయంత్రం పూజల అనంతరం ఆలయంలో అఖండ దీపాన్ని వెలిగించారు. అనంతరం భక్తులు ఆలయంలో దీపాలను వెలిగించారు. వేంకటేశ్వరస్వామి నామం, ఓంకారంతోపాటు పలు దీపాలను వెలిగించగా దీప కాంతుల్లో ఆలయం బంగారు వర్ణంతో మెరిపోయింది. ఆలయ అర్చకుడు వాడపల్లి ఆదినారాయణాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. దీపోత్సవాన్ని ఆలయ చైర్మన్ మంతెన రామ్‌కుమార్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు పర్యవేక్షించారు.



2902 ఎకరాల్లో పంట నష్టం

నరసాపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల మొంథా తుపాన్ కారణంగా మండలంలో 2902 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఏవో జ్యోషిలా తెలిపారు. 2755 మంది రైతులు నష్టపోయారని, పంట నష్ట పరిహారం రూ. 2.93 కోట్లు వరకు ఉండవచ్చునని అంచన వేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదించినట్టు ఆమె తెలిపారు.

14 నుంచి రైతు మహాసభలు

పెంటపాడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14, 15 వ తేదీలలో జరిగే రైతు సంఘం 23 వ మహాసభలు జయప్రదం చేయాలని సంఘం నాయకులు చిర్లా పుల్లారెడ్డి, సిరపరపు రంగారావు, బంకూరు నాగేశ్వరరావు అన్నారు. పెంటపాడు ప్రజాసంఘ కార్యాలయంలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన తరువాత రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

వైసీపీ పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం రూరల్/తణుకు రూరల్/ఆచంట/ఉండి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల కార్యక్రమానికి ప్రజా ఉద్యమం ఉప్పెనలా కదలి రావాలని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ నెల 12న నిర్వహించే నిరసన కార్యక్రమం పోస్టర్‌ను తాడేపల్లిగూడెంలో ఆవిష్కరించారు. తణుకులో మాజీ మంత్రి కారుమూరి మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం వల్ల పేదలకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుందని ఆరోపించారు. మాజీ మంత్రి రంగనాథరాజు ఆదేశాల మేరకు యువ నాయకుడు చెరుకువాడ నరసింహరాజు, నియోజకవర్గ పరిశీలకుడు ఇండవల్లి వాసు, నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి ముదునూరి మురళీ కృష్ణంరాజు ఆచంటలో పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వైసీపీ ఉండి మండల అధ్యక్ష, కార్యదర్శులు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, గులావిల్లి ధనుంజయ అన్నారు. ఎంపీపీ ఇందుకూరి హరినారయణరాజు పాల్గొన్నారు.

సోమేశ్వరుడికి భక్తుల తాకిడి

భీమవరం టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం ఆలయ అర్చకుడు చెరుకూరి రామకృష్ణ విశేష పూజలు చేసి ప్రత్యేకంగా పూలతోను దీపాలతోను అలంకారంచేసారు. ఆలయ ఇవో డి రామకృష్ణంరాజు ఆలయ చైర్మన్ చింతలపాటి బంగ్గారాజు పర్యవేక్షించారు.

రోడ్డుపై శిశువు మృతదేహం

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లి రోడ్డులో శనివారం రాత్రి వారం రోజుల వయస్సుగల మగ శిశువు మృతదేహం బయటపడింది. స్థానికుల సమాచారం మేరకు వీఆర్‌వో ఎం. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని ఎస్సై జేవీఎన్ ప్రసాద్ పరిశీలించారు. ఆ శిశువుకు తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి ఖననం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

మొగల్తూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు మొగల్తూరు ఎస్‌ఐ జి.వాసు తెలిపారు. రామన్నపాలెం గ్రామానికి చెందిన 26 సంవత్సరాలు వయస్సు గల వివాహిత ఇంటి రమ్య భర్తతో విభేదాల కారణంగా లక్కువారితోటలోని ఆమె తల్లి వద్దే ఉంటోంది. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్ళిన రమ్య తిరిగి రాకపోవడంతో ఆమె తల్లి సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.